కథానిక:

# తండ్రీకొడుకులు

శ్రీ యరకల వీరవెంకటరావు

ఉండుండి వెంకటేశ్వరరావు యిలాంటి పని చేస్తాడని ఎవరూ అనుకోలేదు. తనకేమన్నా డబ్బుకులోటా?—తండ్రి కలప వర్తకం చేసి వేనకువేలు గడిస్తున్నాడాయెను. కూర్చుని తినలేక యీ తలగోరిగింపుదేనికి! గొప్పవాడయితే నేమి ఉద్యోగం చేయకూడదని కాదు. చూసిచూసి పేరు ప్రతిష్ఠలు లేని ఈ గుమస్తాగిరిలో దిగటం ఏమి తెలివయిన పని? పగలల్లా చాకిరీచేస్తే నెలకో అరవై రూపాయలు పడేస్తారు. పోనీ, ఏదో వొక వుద్యోగంలో చేరాడేబో, తండ్రినుంచి వేరుపడిపోవడమేమిటి? ఆఖరకు నిక్షేపంగా బ్రతకలేక లేని తద్దినం తెచ్చిపెట్టుకున్నాడు. వెఱ్ఱివాడు! అనుకున్నారు ప్రజలు. "వెంకటేశ్వరరావుకు మతి భ్రమించిం" దని, కొందరు ప్రముఖులు నిర్ధారణగా తీర్మానించారు.

కాని వెంకటేశ్వరరావుకు తను చేసిన పని ఉత్కృష్టమయిన పనిగానే తోచింది. పెళ్లయి మూడేళ్లయింది. ఈనాటివరకూ తను దమ్మిడీ తేలేదు. తండ్రి వ్యాపారం చేస్తుంటే తను భార్యతోబాటు పనీపాటా లేకుండా యింట్లో కూర్చోవడం అతనికి మనస్కరించలేదు. తనూ కొద్దో గొప్పో స్కూలుఫైనలువరకూ చదివాడు, గద! తన పొట్ట తను పోషించుకోలేడా! తను ఎందుకు బ్రతుకుతూన్నట్టు? ఈ ప్రపంచంలో నిరుద్యోగిగా బ్రతకటంకంటె దౌర్భాగ్యస్థితిలేదనిపించిం దతనికి. తండ్రిపై ఆధారపడి వున్నంతకాలం తను అస్వతంత్రుడే నన్నట్టు తోచింది. తనని లోకులు తక్కువగా భావిస్తున్నట్టు వెంకటేశ్వరరావు నిత్యమూ తలపోయసాగాడు. ఏదో ఉద్యోగంలో ప్రవేశిస్తే తను ధైర్యంగా తలెత్తుకు తిరగవచ్చుననుకున్నాడు. అతని ఆలోచన లిలా నడిచాయి. ఈ ఆలోచనలతోనే వెంకటేశ్వరరావు యింట్లో ఎవరితోనూ సంప్రదించకుండానే కలెక్టరాఫీసులో గుమస్తాగా చేరాడు.

అప్పటివరకూ సుఖకరమయిన జీవితానికి అలవాటు పడివున్నా కష్టపడి సంపాదించుకొంటున్న ఈ రోజులే వెంకటేశ్వరరావుకు సుఖతరమనిపించాయి. తను తండ్రివద్ద నుండి దమ్మిడీ కూడా తీసుకోవడంలేదు—తన భారం తండ్రిమీద మోపలేదు. ఎంత సంపద వున్నా, కష్టపడి పనిచేసి సంపాదించుకోవడం మానవుని కుండవలసిన సహజశిక్షణ అనుకున్నాడు వెంకటేశ్వరరావు. ఆ క్లుప్త జీతంతో జీవితం గడుపుకు రావడంతో అతనికి కొద్దికాలంలో అనేక అనుభవాలు కలిగాయి. కష్టజీవికుండే విశాల హృదయం, నిర్మలవాత్సల్యం భాగ్యజీవి కుండవని అతని కొక గాఢనమ్మిక కలిగింది.

వెంకటేశ్వరరావు చేసిన పనికి తండ్రి చాలా క్షోభపడ్డాడు. ఒకరోజున వచ్చి "నాయనా! నామీద కక్షతో యిలాంటి పని చేశావా? నేను నీకేమి ద్రోహం చేశాను? కోరినవన్నీ నిమిషాల మీద సమకూర్చాను. పుట్టినప్పట్నించీ ఏలోటూ రాకుండా పెంచాను. నన్నీ వృద్ధాప్యంలో ఎందుకు దుఃఖపెడతావు? లోకులు వెంకటేశ్వర్లుని తండ్రి యింట్లోంచి వెళ్లగొట్టాడని చెప్పుకొంటుంటే నే నెలా తలెత్తుకు తిరగగలను? నీ కెందుకీ శ్రమ? వెంటనే మానేసి యింటికి వచ్చేయ్!" అని సజలనేత్రాలతో కొడుకును బ్రతిమాలాడు తండ్రి. వెంకటేశ్వరరావు చెదిరిన హృదయాన్ని కూడదీసుకొంటూ అన్నాడు: "నిన్ను చెడుగా లోకులు అర్థం చేసుకుందుకు నే నేమీ విషప్రచారం చేయలేదు నాన్నా! లోతుపాతులు తెలియని గ్రుడ్డి సంఘంచేసే ఆరోపణలకు భయపడటం వట్టి తెలివితక్కువపని. నా దారిని నేను బ్రతకదల్చుకొన్నాను. అదే నాకు సుఖం. నే నెల్లప్పుడూ నీపట్ల భక్తిగానే వుంటాను. నన్ను బలవంతపెట్టకు." తండ్రి ఎన్నో చెప్పిచూశాడు. వెంకటేశ్వరరావు సమ్మతించలేదు. వచ్చినవాడు వచ్చినట్లే వెళ్లి పోయినాడు తండ్రి.

అకస్మాత్తుగా వెంకటేశ్వరరావును మరోకవూరు ట్రాన్స్ఫరు చేశారు. ఎవ రెన్ని చెప్పినా వినకుండా భార్యను తీసుకుని ప్రయాణమై వెళ్లిపోయాడు వెంకటేశ్వరరావు. పన్నెండు రూపాయల అద్దె కొక యిల్లు తీసుకుని వాళ్లిద్దరూ అందులో నివసించసాగారు. పగలెల్లా ఆఫీసరు మెప్పు పొందేందుకు చెమటోడ్చి పనిచేసేవాడు. రాత్రి పన్నెండుగంటలవరకూ ఏవేవో పుస్తకాలు చదివేవాడు. నానాటికీ అతనిలో ఉత్సాహకరమయిన ఉత్తేజం కలుగసాగింది. జీవితరంగంలో సాధ్యమయినంత ఉన్నతునిగా తయారయ్యేందుకు ప్రతీవానిలోనూ శక్తి కలదని అతని అంతరాత్మ పదేపదే నొక్కి చెప్పింది.

వెంకటేశ్వరరావు ఇంటర్మీడియేటుపరీక్షకు చదివాడు. ప్యాసయ్యాడు. ఆఫీసులో అతను హెడ్ గుమస్తా అయ్యాడు. కలెక్టరుగారి కతనంటే అపారవాత్సల్యం ఏర్పడింది. ఇద్దరూ కులాసాగా షికారు పోతూంటారు. ఆయన కారులో వెంకటేశ్వరరావును తీసుకొచ్చి అతని యింటివద్ద దిగబెడుతూండేవాడు కలెక్టరుగారు. అతని హోదాను, గౌరవాన్ని చూసి తక్కిన గుమస్తాలు అసూయపడటం వెంకటేశ్వరరావు చూసీ చూడనట్లుండేవాడు.

ఇల్లు వదలిపెట్టివెళ్లిన ఆరేళ్లలో వెంకటేశ్వరరావు బి. ఏ. డిగ్రీ సంపాదించుకున్నాడు. ఇప్పు డతని బంధువర్గాలవారికి అతనొక అద్భుత వ్యక్తిగా కన్పట్టసాగాడు. వాళ్లల్లో వెంకటేశ్వరరావుని అర్థం చేసుకొన్నవారు అరుదు. అయినా అతను స్వయంశక్తితో పైకిరావటం వారికి వెంకటేశ్వరరావుపై ఆత్మీయతను యినుమడింపజేసింది

తన వూరిలోనే వెంకటేశ్వరరావుకు కలెక్టరు వుద్యోగం లభించినా, అతనేమీ పొంగిపోలేదు. తన పూర్వపు టనుభవాలను అతిభద్రంగా మననం చేసుకోవటం అతనికి పరిపాటయింది. వాటివల్ల అతను కనిపెట్టిందేమంటే "మనముందు గడచిపోతూన్న ప్రతీనిముషంలోనూ మహత్తరమయిన విలువ వుంది" అని. ఇప్పు డతని తండ్రి ననేకులు ధన్యుడని పొగడసాగారు. తన పుత్రుని మూలాన తన కింత పేరు వస్తుందని తండ్రి అనుకోలేదు. ఆ వృద్ధుడు కళ్లు మూసుకుని గద్గద కంఠంతో అనుకునేవాడు. "భగవంతుడా! నా పుత్రుని రక్షించు." తన పుత్రుని అభివృద్ధిని తాను నిరోధించినవాడల్లే బాధపడేవాడు వృద్ధజనకుడు. కలెక్టరుగారి తండ్రి మరణించాడంటే ఊరిలో అనేకులు వెంకటేశ్వరరావుకు సానుభూతి చూపారు. ప్రజలకు తనమీద యింత ఆదరణకలిగిందని అప్పుడే తెలుసుకున్నాడు వెంకటేశ్వరరావు. తండ్రికి చేయవలసిన పితృకర్మల నన్నిటినీ యథావిధిగా జరిగించాడు. తండ్రి సంపాదించిన అరవై వేల రూపాయల ఆస్తంతా ఏకైకపుత్రుడయిన వెంకటేశ్వరరావుకు లభించింది. దానితో తండ్రిస్మృతిచిహ్నంగా ఒక సత్రం కట్టించాడు. అతని స్వార్థత్యాగాన్ని అనేకులు వేనోళ్ల పొగిడారు. వెంకటేశ్వరరావు గత చరిత్రనంతా స్మరించి తండ్రిపట్ల తనేమయినా అక్రమంగా ప్రవర్తించానా అని పరితపించసాగాడు. "భగవంతుడా! నా తండ్రికి ఆత్మశాంతి ప్రసాదించు!" అని ఆఖరుసారిగా ప్రార్థించాడు.

కథానిక:

# మందు నీళ్లు

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

బాగా చీకటిపడింది. ఊరంతా అప్పుడే మెల్ల మెల్లగా నిశ్శబ్దంలోకి మునిగిపోతూంది. వీధిలో పంచకింద నులకమంచంమీద కంసాలి వీరయ్య జబ్బుతో మూలుగుతూ పడుకున్నాడు. మధ్యమధ్య దగ్గుతూ చూరుకి వేలాడవేసిన గోనె చేత్తో ఎత్తి, వీథిలోకి కాండ్రించి ఉమ్మేస్తున్నాడు. అవును పాపం, నెల్లాళ్లయి మంచమెక్కేడు మరి! క్షయరోగం, మనిషిని పూర్తిగా తొలిచేసేవరకూ చంపేదు. అందులోకి ఇవాళ దగ్గు బాగా ఎక్కువైంది; ఈరాత్రి గడవడం కష్టం - కూతురు లచ్చమ్మ వచ్చి, ఇంట్లోకి వీథిలోకి కూడా వెలుతురువచ్చేటట్లు దీపపు బుడ్డి గుమ్మంమీద పెట్టింది. కంసాలి వీరయ్యకు లచ్చమ్మ ఒక్కర్తె కూతురు. రథాల్లాంటి ఇద్దరు కొడుకులు చచ్చిపోయారు. భార్య ఆనాడే వొదిలీసింది. దానికి సిగ్గులేదు. ముగ్గురు పిల్లల్ని కన్నతరువాత మొగుణ్ణి వదిలి, జంగపాడితో లేచిపోయింది.

వీరయ్య బాగా ఉన్నరోజుల్లో మంచి పనిమంతుడు. బాడితపడితే రూపాయి. చిత్రిక పట్టేడంటే, ఎలాంటి పేడు అయినా అద్దంలా తళతళ లాడాలి. "దీని తస్సా గొయ్యా, మనం, చిత్రికపడితే బల్ల సెక్కమీద నీడ కనిపించాల బాబూ, నీడ. అదీ పనోడితనమంటే—మొన్న పట్నంలో పోలీసు ఇనస్పెక్టేరుగారింట్లో మంచం సేసినాను సూసినారా బాబూ, ఏదీ పట్నపాడినొక్కడిని సెయ్యమనండి సూదాం"—అనేవాడు గర్వంగా. పొద్దున్నే లేచి స్నానం చేసి పిండికట్లు శరీరమంతా పెట్టి, నుదుటిమీద కాని అంత బొట్టు పెట్టి, భోంచేసి, బట్ట లేసుకుని, భుజంమీద ఎర్రటి సిల్కు వాణీ గాలికి ఎగురుతూంటే మీసం మెలివేస్తూ, మందగమనంతో మెల్లిగా అడుగులు వేసుకుంటూ దారి పోయే వాళ్లని పలకరించేవాడు. ఎవరేనా ప్రమాదవశాత్తు "ఎక్కడికోయ్"అని అడిగేరంటే, "తెలీదేటి బాబూ, పట్నంలో ప్లీడరిగారి ఇల్లు కడుతున్నాను గాదా? మాటమీద పంతం వొచ్చి ఇల్లంతా నా ఒక్కచేతిమీద కట్టేస్తున్నాను. ఇసవబ్రాహ్మడి పంతమంటే ఏటి? మజాకాలా?" అనేవాడు. అనడమే కాదు పనికూడా అలాగే చేసేవాడు. నలుగురి పని ఒక్కడే చేసేవాడు. లాల్చి యిప్పి, చేత్తో రంపం పట్టుకుని చూరు బల్ల కోస్తూంటే, చెమటపట్టిన శరీరంలోని కండలు, వెదురుకర్రలా పెళపెళ విరిగేవి. సాయంత్రమయేసరికి రెండుమూడు రూపాయిలు కళ్లజూసేవాడు. కాని తెచ్చిన డబ్బంతా తాగేశాడు. పిల్లలున్నారనైనా చూడకుండా ఉంచుకున్న సాలిదానికి చాలా డబ్బు పెట్టేశాడు.



దక్షిణ అమెరికాలోని చిలీరాజ్య ప్రతినిధియగు డా॥ జూ ఆక్ మారిక్ గారు ఢిల్లీలో ఏప్రిల్ 6 తేదీన భారత ప్రధాని పండిత జవహర్‌లాల్ గారిని సందర్శించి సంభాషించిరి.

కాని ఇప్పుడో? కాళ్లుచేతులు వొంగిపోయాయి. వొంట్లో శక్తి లేదు. చాలారోజులై మంచం పట్టేడు. ఇంట్లో తాగడానికి గంజినీళ్లైనా లేవు. ఆఖరికి అభిమానం చంపుకుని సాలిదాన్ని పాతికరూపాయిలు అప్పు అడిగితే నోటు రాయమంది. అవును మరి. డబ్బున్నంతకాలమే అభిమానాలు! అయితే మూడుసెలలనుంచి ఇంట్లో దినాలు ఎలా గడుస్తున్నాయి? అందులో రహస్యమే ముంది. లచ్చి తెస్తూంది. తెచ్చి ఇంట్లో అందరికీ పెడుతూంది. తను డబ్బుతెచ్చి ఊరువాళ్లకి పెట్టేశాడు. తనకంటె లచ్చి ఎన్నోరెట్లు నయం.

"లచ్చీ" అని ఆయాసంగా మూలిగేడు ముసిలాడు.

"ఏటయ్యా—ఏటి కావాల?"

"నచ్చి, ఇయాలరేతిరి మరి గడవదే!" దగ్గుతో మాటలాడలేకపోతున్నాడు.

"మంగలాడినడిగి మందునీళ్లు తెస్తాను తాగు."

"ఛీ—ఎంతవోయిద్దుడయినా మంగలాడిసేతి నీళ్ళు తాగమంటావేటే"—

"సాలిదానికన్న మంగలాడేటి తీసిపోనాడు? అయినా ఊరికొక్కడే వొయిద్దుడు మరి—"

"లచ్చీ, అన్నాళ్లు సాలిదానితో ఉన్నా గాని, ఒకదినం దానిసేతినీరు తాగనేదు. ఎరికా? ఏటనుకున్నావో, ఎం—" అన్నాడు గర్వంగా.

"సస్తూంటే జాతేటి నాయినా, బాపనాళ్లే తాగినారు ఆడిసేతి మందునీళ్లు."

"బాపనోళ్లకంటె సిగ్గునేదు. నా జలమలో కంసాలాడింట్లో తప్పించి ఇంకోడిసేతి నీళ్లు తాగనేదు. ఒకమెతుకు తిననేదు. అయినా సచ్చేముందు తాగితేమాత్రం ఏటి నాబంసెప్పు?" ముసిలాడికి బతుకుమీద ఆశ లాగుతోంది. బతికి సుఖపడకపోయినా, ప్రాణం అంటే ఎవడికి తీపి కాదు?

"కంసాలి గంగయ్యకి జ్వరమొస్తే పట్నం నుంచి తెప్పించినాడు డాకిటేరుని."అన్నాడు మూలుగుతూ.

"డబ్బో. ఆడు పాతికరూపాయి లిచ్చినాడు. ఆడికేటె నంజకొడుకు."

"ఛీ తప్పే. ఆడినంటే పుట్టగతు లుండయే. ఆ డెక్కడాడు? సాచ్చాత్తు ఈరబ్రెమ్మం!"

"డబ్బు నేకపోతే ఈరబ్రెమ్మమైనా మంగలాడి మందునీల్లు తాగాలసిందే!" అన్నది లచ్చి. ఆమాటకూడా నిజమే. డబ్బులేకపోతే గంగయ్య ఏం చేసేవాడో ముసిలాడు ఊహించుకోలేకపోయాడు. గంగయ్య ఊళ్లో కంసాలికులానికి పెద్ద. బంగారప్పనిచేసి డాబా ఇల్లు కట్టేడు. నూరు తులాల బంగారం ఆర్జించాడు. పాడీపంటా ఉన్నాయి. దైవభక్తుడు. ఊళ్లో గొప్పపలుకుబడి ఉంది. ఇంకేం కావాలి. వాడికి జబ్బొస్తే డబ్బు ఖర్చుపెట్టి బాగుచేయించుకుంటాడు. వాడిలాంటి

(21-వ పేజీ చూడుడు)

# అమెరికన్ డాలర్ల పెట్టుబడి

(8 వ పేజీ తరువాయి)

ఒడంబడిక ఒకటి జరిగినట్లు చెప్పుతున్నారు. కాంగ్రెస్ ఈ విషయాన్ని విచారించాలి. సర్వ స్వతంత్ర మనుకునే ఒక ప్రభుత్వంతో ఒక వ్యాపారసంస్థ ఎన్నడూ ఇటువంటి అప్రతిష్ఠాకర మైన ఒడంబడిక చేసుకోలేదు. హవానా ఒడం బడికను నేను చూశాను. ఈ ఒడంబడిక అమలు జరిగినట్లయితే ఇండోనీషియాలోని ఆర్థికజీవనం అంతా ఒక అమెరికన్ వ్యాపారసంస్థగుప్పిట్లో ఉంటుందన్నమాట. ఈ వ్యాపారంలో ఏమి నష్టం కష్టం వచ్చినా రిపబ్లిక్ ప్రభుత్వమే భరి స్తుంది. నూటికి $7\frac{1}{2}$ వంతులు కంపెనీకి లాభం ఇవ్వగల రని గారంటీకూడా ఇస్తుంది."

న్యూయార్క్ టైమ్స్ పత్రికలో జనవరి 11 వ తేదీని జినీవా వార్త ఒకటి ప్రచురించ బడింది. అందులో సి. యల్. సల్జ్ బర్గర్ నిర్మొహమాటంగా ఈ క్రింది రీతిగా తన అభి ప్రాయం వ్యక్తపరిచాడు: "యూరప్‌లో ప్రజలు ఈనాడుకూడా విలాసజీవనం గడుపు తున్నారంటే, వారి జీవనప్రమాణం ఇంత అధి కంగా ఉందంటే అదంతా ఆసియా ఆఫ్రికా ఖండాల్లో ముడిపదార్థాలు, చౌకలో కూలీలు లభించడంపైనే ఆధారపడిఉంది. ఈ నాడు పూర్వవలసరాజ్యవిధానం సామ్రాజ్య విధానం అంతరించినప్పటికీ, పునరుజ్జీవం పొందుతున్న యూరోపియన్ దేశాలు, ఆ జీవనాధారాన్ని పోనాడుకోలేవు. ప్రజల నాకర్షించే కొత్త ప్రజాస్వామ్య విధానం అనే నినాదంతో ఈ దేశాల్ని సోవియట్‌రష్యా తన ప్రాబల్యంలోకి తెచ్చుకుంటోం టే, యూరోపియన్ దేశాలు మిన్నకుండలేవు."

అయితేనేం అమెరికన్ విదేశాంగశాఖా కార్యదర్శి డీన్ ఆచిసన్ ఒక ఇంటర్వ్యూలో ప్రభుత్వ కార్యక్రమంలో వ్యక్తిగతంగా పెట్టు బడిదారులు పెట్టుకునే అవకాశం కూడా ఉంటుం దని ప్రకటించాడు. పరిస్థితులన్నీ సుము ఖంగా ఉంటే పెట్టుబడి కేం ప్రవాహంగా వచ్చిపడుతుం దన్నాడు.

అమెరికాలోనే ఉత్తరాన ఉన్న స్టేట్స్ నుంచి పెట్టుబడిదారుల నాకర్షించడం కోసం "పరిస్థితుల్ని సుముఖంగా" ఉండేటట్లు చేయ డానికి గత పదిసంవత్సరాలుగా కృషి జరిగింది. ఉత్తరప్రాంతానికీ, దక్షిణప్రాంతానికీ మధ్య వ్యవహారాలు దాదాపు సామ్రాజ్య ప్రభుత్వానికీ, వలసదేశానికీ మధ్య వ్యవహారాల మాదిరిగానే ఉంటాయి. కాబట్టి దక్షిణాన జరిగిన కృషి ఫలితం తెలుసుకుంటే ఇంక ప్రపంచవ్యాప్త మైన కార్యక్రమం ఎలా వుంటుందో గ్రహించ వచ్చును. ఉత్తరపారిశ్రామికుల్ని ఆకర్షించ డానికిగాను మిసిస్సిపి - కార్యక్రమం ఒకటి "వ్యవసాయంతో సమానంగా పరిశ్రమల్ని కూడా వృద్ధిపరచా"లనే ఉద్దేశంతో మొట్టమొదట ప్రారంభించబడింది. అయిదు సంవత్సరాలపాటు ఈ పరిశ్రమలవారు కొన్ని పన్నులు చెల్లించ నక్కరలే దని మినహాయించారు. కొన్నికొన్ని ప్రాంతాలలో ఇన్ని సంవత్సరాలు నిరుద్యోగ బాధ తొలగిస్తామనే గారంటీ ఇచ్చి ఆ ప్రాంత వాసులచేత ఋణపత్రాలు (బాండ్లు) కొనిపించి ఫాక్టరీలు నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో జీవనప్రమాణం వృద్ధిపొందినమాట నిజమే. కాని మిగతా ప్రాంతాలలో అక్కడ వర్తకులతో ఉత్తరాది పారిశ్రామికులు లాలూచీ చేసుకొని, అక్కడ ఆర్థికవ్యవస్థని చిత్తంవచ్చినట్లు ఏలారు. కార్మికసంఘాలను బలపడనివ్వలేదు. ఈ దక్షి ణాది ప్రాంతాలలో వాస్తవంగా దేశీయ సంపదైన అడవుల్నీ, గనుల్నీ, చౌక కూలీ పరి శ్రమనీ దోచుకున్నారు. ఈ దోపిడి సరిగా వలస దేశాల దోపిడిపద్ధతినే ఉంటుంది. ప్రజలు ఎప్పటి మాదిరిగా పేదలుగానే ఉండిపోయారు.

ఇటీవల పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలు చూస్తే వింత ధోరణి కనిపిస్తోంది. గత 30 సంవ త్సరాలుగా చౌక కూలి ఎక్కడ దొరుకుతుందో ఎక్కడ కార్మికుల సంఘాలు బలపడలేదో వెతు క్కుంటూ క్రమక్రమంగా దక్షిణానికి జరిగి పోతున్నాయి. అదే రీతిగా అన్యదేశాల్లోని అమెరికన్ కంపెనీలు పరిశ్రమలు కూడా చౌక కూలీలు దొరికే ప్రాంతాలు వెతుక్కుంటూ కదిలి పోతున్నాయి.

రెమింగ్టన్ లాండ్ టైప్‌రైటర్ కంపెనీ వారి నాలుగు ఫ్యాక్టరీలను స్కాట్‌లండ్‌కు తీసుకుపోవాలని యత్నిస్తున్నందువల్ల, వానినట్లు రాకుండా చేయాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ కంపెనీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఈ మధ్యనే అమెరికన్ ఎసోసియేటెడ్ ప్రెస్ ఒక వార్త పంపింది. అండర్వుడ్ టైప్‌రైటర్ కంపెనీ ఒక ఫ్యాక్టరీని ఇటలీలో స్థాపించి అక్కడనుంచి సరుకును అమెరికా పంపిస్తున్న దని కూడా పై కంపెనీ ఫిర్యాదుచేసింది. ఈజీ వాషింగ్ మెషీన్ కంపెనీ తన ఫ్యాక్టరీలలో కొన్ని ముఖ్యమైన యంత్రపరికరాల్ని దక్షి ణాఫ్రికా పంపిందట.

కంపెనీలు కూలి ఇవ్వడంలోనూ, కార్మికుల ఆరోగ్యం కాపాడ్డంలోనూ, వారికి గృహవసతి వారి బిడ్డలకు విద్యాసౌకర్యాలు మొదలైన సౌక ర్యాలిచ్చే షరతుపైన పెట్టుబడిదారులు అన్య దేశాలలో పరిశ్రమలు స్థాపించవచ్చుననీ, ప్రత్యా మ్నాయంగా పెట్టుబడిదారులకు కనీసలాభ ప్రమాణం గ్యారంటీ ఇవ్వాలనీ ట్రూమన్ కార్య క్రమంలో ముఖ్యాంశాలు. ఇదే పెద్ద సమస్య కూడా. పై హామీ లెందు కివ్వాలంటే మనతో (అమెరికన్లతో) పైవన్నీ ఇవ్వగల రని చెప్తూ పోటీకి వచ్చేవారు నూత్న వ్యవస్థ తెచ్చిపెట్టగల రని ప్రచారం చేస్తున్నారు కాబట్టి ఇప్పు డీ సమస్యను ట్రూమన్ పరిష్కరించాలి.

---

# మందు నీళ్లు

(11వ పేజీ తరువాయి)

ప్రాణమే తనదిని. "నచ్చీ, తెస్తే తెచ్చినావు గాని, గంగయ్యకి తెలీనీక"-అన్నాడు మెల్లిగా.

లచ్చి ఆలోచిస్తూ గుమ్మంమీద కూర్చుంది. తండ్రికి పదిరోజులై మందు లేదు. ముసిలాడు ఎలానూ బతకడు. కాని చూస్తూచూస్తూ ఎలా చంపడం? మందిస్తే బతికితే బతకొచ్చు నంటాడు వైద్యుడు. కాని పది రూపాయి లిస్తేనేగాని మం దివ్వడు. ఎక్కడినుంచి తేవడం పది రూపాయలు?

బయట చీకటి చిక్కగా ఉంది. ఊరంతా అప్పుడే చచ్చినట్టు నిద్రపోయింది. లచ్చి కేం తోచడంలేదు. ఎవ డిస్తాడు పది రూపాయలు? ఏం చెయ్యడం, ఆఖరికి సన్నిబాబే గతి.

వీధిలోంచి "ఈరయ్యా"అని కేక వేసి, చూరుకిందనుంచి వొంగి లోపలికివచ్చాడు సన్ని బాబు. సన్నిబాబు కంసాలిగంగయ్యకొడుకు. "సన్నీ - నువ్వట్రా-ఏటి ఇసేసాలు?" అన్నాడు ముసిలాడు.

"సస్తున్నవోడివి నీ కెందుకేస్ ఇసేసాలు? తొంగో, తొంగో!" అంటూ లచ్చి చెయ్యి పట్టుకుని లోపలికి లాక్కుపోయాడు సన్ని బాబు. ముసిలాడు, "హి, హి, హి,"అని పళ్లు ఇగిలించి నవ్వేడు. అతడికేం చింతలేదు. రోజూ జరిగేదే. సన్నిబాబు చాలా తెలివైనవాడు. చాలా డబ్బున్నవాడు. జల్సామనిషి. గంగయ్య కొడుకు! తనింటికి రావడం తన కూతురితో స్నేహం చెయ్యడం తన కెంత గౌరవం. లచ్చికి పెళ్లి కాలేదు. అయితేనేం, సన్నిబాబులాంటి వాడి స్నేహం కుదరడం ఎంత అదృష్టం! సన్ని బాబుకి పెళ్లి అయితేనేం? లచ్చి అంటే ఎంత అభిమానం! సన్నిబాబుద్వారా గంగయ్యవల్ల ఎన్నిపనులేనా చేయించుకోవచ్చు. ఊళ్లో ఎంత మంది గంగయ్యవల్ల పనులు కావలసినవాళ్లు తన్ను ఆశ్రయించలేదు? లచ్చికి సన్నిబాబుతో స్నేహం; తద్వారా తనకి గంగయ్యతో స్నేహం! గంగయ్యతో సమానంగా తిరిగే టప్పుడు ఎంత లేకపోయినా తనుకూడా కొంత దర్జా చూపించాలి. గంగయ్య కులపెద్ద. గొప్ప వేదాంతి. తను కూడా కొంచెం వేదాంతం కబుర్లు చెప్పగలడు. వీరబ్రహ్మం తత్వాలు పాడ గలడు. అంచేతే ఇన్నాళ్లూ వాడిదగ్గర దర్జాగా మెసులుకొచ్చాడు. ఇప్పుడంటే కాళ్లూచేతులూ పడిపోయాయి, అందరూ తొంగిచూడడం మానీశారు.

తెల్లవారుతూంది. కాని ఇంకా చీకటి ఉంది. దీపపుబుడ్డిముందు లచ్చి కూర్చుని కునుకు పాట్లు పడుతూంది. ముసిలాడికి ఆయాసం మొద లైంది. "నచ్చీ"అని ఊపిరి బిగబెట్టి పిలిచాడు.

"ఏట్రా"అంటూ తుళ్లిపడి లేచింది.

"సన్నిబా బేడే?"

"ఎల్లి పోనాడు."

"నచ్చీ, సత్తూంటే కులమో పొక్క డేనా తొంగిసూసినాడుకాడు."

"పోనీ సూసేటినాబం?"-ముసిలాడు బాధపడు తూంటే చూడలేకపోయింది. "వొయిద్దుడిని పిలుసుకొత్తా నుండు బాబూ" అన్నది.

"రాడు నంజకొడుకు."

"డబ్బిత్తే ఎవడికోసం వొత్తాడు?"

"ఎంతిచ్చినాడేటి సన్నిబాబు." అన్నాడు మూలుగుతూ. సన్నిబాబివ్వకపోతే ఎలా వొస్తుంది డబ్బు! సన్నిబాబు మంచివాడు.

"పది రూపాయిలిచ్చినాడు. సాలవేటి?"

ముసిలాడికి ఆయాసం ఎక్కువైంది. తెరలు తెరలుగా దగ్గుతున్నాడు. లచ్చి తండ్రిబాధ చూసి కంట తడిపెట్టుకుంది. ఎటువంటి మనిషికి ఎలాంటి స్థితి వచ్చింది! ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చిన ట్లైంది. పాపం! తండ్రి యవ్వనంలో ఉండేటప్పుడు ఎంత దర్జా, ఎంత జల్సాగా ఉండేవాడు. ఆఖరికి మందుకి డబ్బు లేక చనిపోతున్నాడు. వైద్యుడిని తీసుకురావ డానికి లేచి రెండడుగులు వేసింది.

"వొద్దు, నచ్చీ సెప్పినమాటిను. వొద్దు- మ రెందుకేటి మందు?" తనెలాగా ఇక బతకడు. మం దెందుకు, డబ్బు దండుగ. తను బతికున్న న్నాళ్లూ ఎవరిచేతా వేలుపెట్టి చూపించుకో లేదు. నలుగురిలోనూ గౌరవంగా బతికాడు. తను చచ్చేటప్పుడుకూడా గౌరవంగా చావాలి. తను చచ్చేక తన పేరెత్తి ఎవరూ ఓమాటన కూడదు. బతికినా చచ్చినా నిలబడేది పేరే.

మళ్లీ దగ్గు భారంగా వచ్చింది. ఆయాసం ఎక్కువైంది. లచ్చి "నాయనా"అని పలకరిం చింది. "లచ్చీ, ఆ డబ్బెట్టి, నా కరమ సేసీయే. తప్పక సేసీయే." అని కళ్లు మూశాడు.

---

# రాజ్యాంగము-అర్థనీతి

(17-వ పేజీ తరువాయి)

తులది బంగారునాణెము. పాలించే ప్రభు వొక్క డైనా, భారతదేశమునకు వెండి నాణెము, బ్రిటిషువారికి బంగారునాణెము వుంచడ మనేది చాల అన్యాయము. దీనినిబట్టి, బ్రిటిషువారీ దేశమున నెంత నిష్పక్షపాతబుద్ధితో వ్యవహరించి నారో విశదము కాగలదు. మన మిచ్చుకోవలసి నది బంగారము. వారు మనకిచ్చునది వెండి. ఈవిధముగా కొంతకాలము గడచినది. సాధార ణముగా లోకములో వెండి, బంగారముకంటె, వెండి, పదిహేనురెట్లుకువ్వన్నమాట. ఏతత్కా రణమువల్లనే, ఒకతులం బంగారానికి పదిహేను తులాలు వెండి అనే నిర్ణయం. అథాత్తుగా, ఆస్ట్రేలియాలోనూ తన బంగారుగనులు బయ ల్పడడముతోనే బంగారము వుత్పత్తి మెండైనది. వెండి వుత్పత్తి తగ్గిపోయినది. అదివరకు ఒకతులం బంగారానికి 15 తులాలు వెండి కోరి కేది, రెండుతులాలు బంగార మిస్తేనేగాని పది హేను తులాలు వెండి దొరకడం దుర్లభమైనది. ఈ సందర్భములో, ప్రభుత్వమువారు, వెండితో తీర్చుటకు యేర్పర్చుకున్న ఋణాలవాయిదాలు సమీపించాయి. ఋణదాతల వొత్తిడి యెక్కువ కాజొచ్చినది. వెండి ప్రియమైనది. బంగారము దానిని కొని తీర్చవలసివచ్చుటవల్ల రెట్టింపు బంగారము ఖారవిడువవలసి వచ్చినది. దానితో ప్రభుత్వము వారికి ఖంగారుపుట్టింది. వెంటనే విదేశములనుండి యీ లోహముల యెగుమతి దిగు మతులను నిషేధించి, వెండి బంగారముల ధరను, కంట్రోలు చేసినారు. క్రమక్రమముగా, రూపాయిలోని వెండిని తగ్గించి, మిశ్రమ లోహపు పాలును హెచ్చించారు. తదాదిరూపా యికి వుండే విలువ నిజలోహపు విలువగాక ఆకారపు విలువ (*Token value*) యేర్పడింది. అందువల్లనే రు. 100/-ల యెత్తు పరిశుద్ధ మగు ఖాదీ వెండి, యాభై ముద్రితనాణెములగు రూపా యలకు లభించేది.

ఇప్పుడు వెండిరూపాయి అన్నమాటే లేదు. చిల్లర నాణెములు కూడ నిక్కెలు వే. వీటికి తోడు రూపాయినోట్లు, 2 రూపాయిల నోట్లు ప్రచారములో వున్నవి. వీటికి సెంట్రల్ గవర్న మెంటు హామీ లేదు. 5 లగాయతు 100/లవరకు గల నోట్లకు గవర్నమెంటు హామీ వున్నదిగాని, వాటిలో నైనా వెండి రూపాయిలు యిస్తామనిలేదు. "రూపీసు" అని మాత్రము వున్నది. ఇచ్చే హామీ అయినా ప్రజలవలన రాబట్టబడే ఆదాయమే. సామాన్య పౌరుడు, తన నిత్యకృత్యముల కవసరమగు కూర గాయలు, మొదలగు యితర తినుబండార పదార్థ ములను కొనుక్కొనుటకు వినియోగించునది, *I promise to pay* అని ప్రభుత్వము వారు వ్రాసి యిచ్చిన నోటే. ఆ నోటెవరిదగ్గరవుంటే వారు ప్రభుత్వానికి ఋణదాతలన్నమాట. ఈ విధముగా కూలివాడు లగాయతు, కోటీశ్వరుని వరకు ఋణదాతలే. పండించినవాని పదార్థము లకు, కష్టించిన వాని కష్టాలకు, సేవకుల వేత నాలకు ప్రభుత్వమువా రిచ్చే పరిహారము ప్రభు త్వమువారు వ్రాసే నోట్లే. ఇక ప్రజలవద్ద నిలు వేది. ప్రజలు యిచ్చే ఋణమేమిటి? ప్రభు త్వమువద్ద దాచుకొనే నిధి యేమిటి?

## ఇన్‌ఫ్లేషన్ - డిఫ్లేషన్

ప్రజలు నిలువవున్న డబ్బు దాచుకుంటే, ప్రజలలో కొనగోలు శక్తి ధరలు తగ్గుతాయం టారు. ఆర్థిక శాస్త్ర సంబంధమగు ఇన్‌ఫ్లేషన్ డిఫ్లేషన్ అను యేవో రెండు సాంకేతిక పదాలను దిగుమతి చేసారు.

ప్రజలలో కొనగోలు శక్తి సన్నగిల్లి ధరలు తగ్గుతాయని వీరి అభిప్రాయం. ధరలు తగ్గ టానికి అర్థశాస్త్రజ్ఞుల అభిమతం యేమిటంటే, తినేవాళ్లసంఖ్య తగ్గనైనా తగ్గాలి; పంటలు ద్విగుణీకృతంగా పండనైనా పండాలి; నేతికి ప్రతిపద్దాగా దాల్డా సృష్టింపబడినట్లు బియ్యానికి బదులు, మరొకవిధమగు కృత్రిమ బియ్యం కను పెట్టనైనా కనుపెట్టాలి; లేక, ప్రజలను త్రాగుడు నుండి తప్పించి, యితర పానీయములకు మర లించినట్లు, ప్రకృతి సిద్ధమైన, వారివారి, గంటి చోడి, కొర్ర, చామ, జొన్న మొదలగు ఆహార విధానాలకు మరలించనైనా మరలించాలి. తద తర విధానములు నిరుపయోగములు. ప్రజలవద్ద వెండి బంగారాలు అనలేవు. ఏ కొలదిమాత్రము వున్నను, ప్రథమ ఐరోపా మహాసంగ్రామ సమ యములోను ద్వితీయప్రపంచ సంగ్రామ సమ యములోను, బ్రిటిషువారు, ముద్దలోహముల రూపకముగా స్వీయదేశమునకు గొనిపోయిన సంగతి ఆబాలగోపాల మెరుగుదురు. ఇంకా యేమైనా మిగిలియుంటే, స్వరాజ్య సంపాదన సందర్భములో, మూలనున్న ముసలమ్మల మెడల లోనివి, పడుచమ్మల ముంజేతులవి మహాత్మ గాంధీగా రూడదయించారు. ఇన్‌ఫ్లేషన్, డిఫ్లేషను, అను పదాలకు న్యాయమగు అర్థ మేమిటంటే ప్రభుత్వకోశాగారమునిండా వెండిబంగారము లుండి, దేశఖర్చుకు ప్రజలలో చలామణీకి విడుదలబడిన ద్రవ్యము ఏకొలదిమంది వద్ద మాత్రమే చిక్కుపడి అది బయటికి రాక పోవుటవల్ల ప్రభుత్వపుఖజానాకు దెబ్బతగులుతుం దని తోచినప్పుడు నిలువవున్నవాని డబ్బును వెలి కీడ్చి, అసలే లేనివానికి సద్దుబాటు కొనర్చించే విధా నము. "ఇన్‌ఫ్లేషన్‌వల్ల ధరలు హెచ్చించి ఋణ దాతను మోసగించి ఋణాసుడు ఋణములు తీర్చుకోగల అవకాశమును, డిఫ్లేషన్‌వల్ల ధరలు పడిపోయి ఋణదాత ఋణస్థుని మోసగించు అవకాశమును కల్గించుటయగును."

గోదావరిలో ఒకచోట యెత్తుగావున్న తిప్పను త్రవ్వి, లోతుగావున్న మడుగులోపోసి, మట్టంచేయడంవంటిది. అంతేకాని, ప్రజలవద్ద డబ్బుతో ప్రభుత్వపు బొక్కసము పూరింప జూడటం శ్రేయోదాయకములనుకాదు. పూర్తిగా ప్రజలను నిర్ధనులు జేయజూడటము, ప్రభుత్వము నకు క్షేమదాయకము కాదు.

## కర్తవ్యము

మనకు సిద్ధించిన స్వాతంత్ర్యము స్థాయీ భావముదాల్చి, సుస్థిరమగు పునాదులపై స్వరా జ్యము నిర్మింపబడాలంటే, ముందుగా కోశ మును వెండి బంగారములతో పూరించాలి. ఆర్థిక విధానమును సంస్కరించాలి. నిజలోహపు విలువగల నాణెములను, ప్రస్తుతపు నీచలోహ నిర్మితమగు నాణెములకు ప్రతిపద్దిత మొన రించాలి. సామాన్యమానవుడుకూడ ముద్దలోహ మును టంకసాలకు గొనిపోయి నాణెములుగా ముద్రించి యివ్వమని కోరినంతనే మజూరీ మాత్రము పుచ్చుకొని నాణెములు ముద్రించి యిచ్చే సౌకర్య మేర్పడాలి. అప్పుడేకాని, మహాత్మాగాంధీగా రేర్పర్చిన రామరాజ్య నిర్వ చనం సార్థకంకాదు.